క్లుప్తంగా

విష్ణాలయంలో ధనుర్మాస పూజలు


పూజలు చేస్తున్న అర్చకుడు

మనుబోలు: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవాలయం (విష్ణాలయం)లో ఆదివారం ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. అర్చకులు హనుమాచార్యులు సూర్యోదయానికి ముందే స్వామికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

భవన నిర్మాణానికి విరాళాల సేకరణ


యల్లాయపాళెంలో విరాళాలు సేకరిస్తున్న నాయకులు

కొడవలూరు: దేశ రాజధాని ఢిల్లీలో నిర్మించనున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం భవనానికి మండలంలోని యల్లాయపాళెంలో ఆదివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు విరాళాల సేకరణ ద్వారా భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య, సభ్యులు మాల్యాద్రి, దేవకుమారి, మండల కమిటీ సభ్యులు బి.కాంతారావు, దేవానంద్ పాల్గొన్నారు.

పొలాలకు వెళ్లే దారికి మరమ్మతులు



మనుబోలు: మండలంలోని జట్ల కొండూరు గ్రామం పొలాలకు వెళ్లే మార్గం ఇటీవల తుఫాన్ సమయంలో వరద కారణంగా దెబ్బతింది. దీంతో రైతులు ఎరువులు తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాలతో ఆదివారం గ్రామ ఉప సర్పంచ్ ఆవుల తులసీరామ్ ఆధ్వర్యంలో జేసీబీ ద్వారా దారికి మరమ్మతులు చేశారు. గండ్లను పూడ్చి దారిని సరిచేశారు. ఈ పనులను పోతయ్య, సురేష్, శంకరయ్య, పెంచలయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షించారు.

శ్రీవెంకటేశ్వర కళాశాలకు అవార్డు



అవార్డుతో గవర్నింగ్ బాడీ సభ్యులు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెం శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలకు 'అకడమిక్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ - 2023' అవార్డు దక్కింది. ప్రఖ్యాత సంస్థ 'ది అకడమిక్ ఇన్‌సైడ్స్' ఆధ్వర్యంలో బెంగళూరులో ఆదివారం జరిగిన సదస్సులో అవార్డును ఆ కళాశాల గవర్నింగ్ బాడీ మెంబర్స్ కె.సునీల్‌కుమార్ యాదవ్, పి.సాయికృష్ణ యాదవ్ అందుకున్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు శిక్షణ, ఉపాధి కల్పనలో ఎనలేని కృషి చేసి ముందంజలో నిలిచినందుకు ఈ అవార్డు వచ్చిందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ప్రిన్సిపల్ వి.అనిల్ కుమార్ మాట్లాడుతూ అవార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు.

భక్తిశ్రద్ధలతో అధ్యయనోత్సవాలు


శ్రీరామపట్టాభిషేక అలంకారంలో రంగడు


త్రివిక్రమావతారంలో వేణుగోపాలుడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని వైష్ణవాలయాల్లో అధ్యయనోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. తొలుత పది రోజుల పాటు నిర్వహించనున్న పగల్‌పత్తు ఉత్సవాల్లో స్వామివార్లు విశేషాలంకారాల్లో ఆదివారం దర్శనమిచ్చారు.

- నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారు శ్రీరామపట్టాభిషేక అలంకారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా చుండూరు రామయ్య జ్ఞాపకార్థం చుండూరువారి వారసులు వ్యవహరించారు.
- మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామివారు త్రివిక్రమావతారంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఆంజనేయులు శ్రేష్ఠి, హజరత్ శ్రేష్ఠి దంపతులు వ్యవహరించారు.

దళితుల సంక్షేమం వైఎస్సార్సీపీతోనే సాధ్యం



మాట్లాడుతున్న వెంకయ్య

నెల్లూరు రూరల్: దళితుల సంక్షేమం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలోనే సాధ్యమని పార్టీ నేత స్వర్ణా వెంకయ్య పేర్కొన్నారు. 24వ డివిజన్లోని కనుపర్తిపాడు అంబేడ్కర్‌నగర్‌లో దళితులతో ఆదివారం నిర్వహించిన మాటామంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంక్షేమంతో పాటు ఆయా ప్రాంతాల్లోని దళితవాడలను అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. వచ్చే ఎన్నికల్లోనూ తమ పార్టీకి పట్టం కట్టాలని కోరారు. అనంతరం మౌలిక వసతుల కల్పనపై దళితులు విన్నవించారు. అవసరమైన నిధులను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ద్వారా మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ ఎస్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి, దళిత నేత బెల్లంకొండ వెంకయ్య, నేతలు అరవ ప్రభాకర్, దారా రమణయ్య, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణికి రక్తదానం



నెల్లూరు సిటీ: గర్భిణికి ఓ నెగటివ్ రక్తం అవసరం కావడంతో రెడ్‌క్రాస్ అంబులెన్స్, ఆక్సిజన్ బ్యాంక్ కన్వీనర్ అమర్తలూరు ప్రవీణ్‌కృష్ణ రక్తాన్ని ఆదివారం దానం చేశారు. నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు మలిరెడ్డి కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వెంకటేశ్వరుడి కల్యాణం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువగా ఆదివారం నిర్వహించారు. అభిషేకాలు, తదితరాలను జరిపారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా నగరోత్సవం





నెల్లూరు(బృందావనం): నగరంలో జైనుల నగరోత్సవాన్ని కోలాహలంగా ఆదివారం నిర్వహించారు. కాకినాడకు చెందిన ప్రియాల్ వచ్చే ఏడాది మార్చి 3న సన్యాసాన్ని స్వీకరించనున్న నేపథ్యంలో నెల్లూరు విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. మండపాలవీధిలోని సుమతి శ్రేయన్స్ మందిరం నుంచి వివిధ ప్రాంతాల మీదుగా అక్కడి జైన మందిరానికి నగరోత్సవం చేరింది. మధ్యాహ్నం ప్రసాదాన్ని అందజేశారు. జైన ఆరాధన భవన్‌లో ప్రియాల్‌ను సత్కరించారు. సుమతి శ్రేయాన్స్ జైన్ సంగీత్, బాలికామండల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రదర్శనలను నిర్వహించారు. భోగిబాయి పూనంచంద్ లఖావత్, కైలాష్‌కుమార్ పూల్‌చంద్, కమలాబాయి ఘీసులాల, సంగీత సురేష్‌కుమార్, కవితా అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం


ప్రత్యేకాలంకారంలో స్వామి, అమ్మవార్లు


పూజల్లో పాల్గొన్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీనివాసుని కల్యాణం వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా సాయిమోహన్‌రెడ్డి - ప్రసన్నకుమారిరెడ్డి దంపతులు వ్యవహరించారు. ధనుర్మాసం ప్రారంభ రోజున శ్రవణా నక్షత్రంలో కల్యాణం నిర్వహించడం ఎంతో విశిష్టత నెలకొంది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అన్న ప్రసాదాలను అందజేశారు.

- వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి ధనుర్మాస పూజలను ప్రారంభించారు. తెల్లవారుజామున ప్రత్యేక పూజలను నిర్వహించారు.

'స్పందన'ను సద్వినియోగం చేసుకోండి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం పది నుంచి నిర్వహించనున్న కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయాలని పేర్కొన్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

గ్రూప్ - 2 గ్రాండ్ టెస్ట్‌కు విశేష స్పందన


పరిశీలిస్తున్న రామాంజనేయులు

నెల్లూరు(మినీబైపాస్): గ్రూప్ – 2 మెగా గ్రాండ్ టెస్ట్‌ను జిల్లా ఉపాధి కార్యాలయం, సింహపురి ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పరీక్షకు 150 మందికిపైగా హాజరయ్యారు. ప్రతిభ చూపిన వారికి రూ.మూడు వేలు, రూ.రెండు వేలు, రూ.వెయ్యిని అందజేశారు. వీరికి ఉచిత శిక్షణను ఇవ్వనున్నామని స్టడీ సర్కిల్ డైరెక్టర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు ఆర్థిక సాయం


పొదలకూరు: శ్రామికనగర్లో..


పొదలకూరు: అగచాట్లపురంలో..


మనుబోలు: నగదును అందజేస్తున్న సర్పంచ్

పొదలకూరు: మిచాంగ్ తుఫాన్ బాధితులకు ఆదివారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని పంపిణీ చేశారు. శ్రామిక నగర్లో ఒక్కో కుటుంబానికి రూ.2,500 వంతున వైస్ ఎంపీపీ సోమా అరుణ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీహరి, నాయకులు సోమా భాస్కర్, సోమా రామకృష్ణయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

అగచాట్లపురంలో..

పట్టణంలోని అగచాట్లపురం, రామనగర్‌గేట్ సెంటర్‌లో బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2,500 వంతున నగదును సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీహరి, సచివాలయ కన్వీనర్లు వాకాటి శివప్రసాద్‌రెడ్డి, సురేఖ, ఖాదర్, వార్డు సభ్యుడు వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు: మండలంలోని బద్దెవోలు గ్రామంలో తుఫాన్ కారణంగా నష్టపోయిన గిరిజనులకు ఆదివారం వీఆర్వో భగవాన్ ప్రభుత్వ పరిహారం అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.2,500 వంతున నగదును సర్పంచ్ ఉగ్గుమూడి శశికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు భీమవరపు బాలకృష్ణారెడ్డి, బద్దెవోలు కృష్ణయ్యల చేతుల మీదుగా ఇచ్చారు.

గండవరం యోగా గురువు ప్రతిభ

కొడవలూరు: మండలంలోని గండవరం ఆయుర్వేద వైద్యశాల యోగా మాస్టర్ జ్యోతి రాజేంద్రకుమార్‌కు సౌతిండియా వజ్రాయుధం యోగా చాంపియన్‌షిప్ దక్కింది. సూళ్లూరుపేట రాఘవరెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సౌతిండియా యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో ఆయన ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచారు.

యోగా పోటీల్లో ప్రతిభ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సూళ్లూరుపేటలోని రాఘవరెడ్డి కల్యాణ మండపంలో సౌతిండియా వజ్రాయుధం యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో నెల్లూరుకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపి పలు పతకాలను సాధించారు. అండర్ – 11 నుంచి 50 ఏళ్లు పైబడిన విభాగాల్లో వైభవ్‌కృష్ణ, సాత్విక్, కమలేష్, హరి, చేతన్, మిహిరా, మంజూష, దియా, భవజ్ఞ జాహ్నవి, సంజన, ఊహశ్రీ, రాజేంద్ర, రఘురామయ్య తదితరులు ప్రతిభ చాపారు. యోగా గురువు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో అమరగాయకుడు ఘంటసాల జయంతి వేడుకలను శాంతి కల్చరల్స్ అధ్యక్షుడు అమానుల్లాఖాన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. శాంతి ఆర్కెస్ట్రా ఈవెంట్స్ ఆధ్వర్యంలో సంగీత విభావరి.. రాజా డ్యాన్స్ స్టూడియో ప్రత్యేక నృత్యాలు.. కళానికేతన్ ఈవెంట్స్ నిర్వహించిన కోలాట ప్రదర్శన తదితరాలు ఆకట్టుకున్నాయి. సినీ గీతాలను సీనియర్ గాయకులు మధుసూదన్, రామచంద్రరావు, షఫీ, విజయలక్ష్మి, విమల, పావనీ దాస్ ఆలపించారు. అనంతరం నూర్‌బాషా సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలేషాను సత్కరించారు. పాటలు, నృత్య పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. నాట్యాచార్య రమణయ్య, చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అధినేత రమేష్‌బాబు, పద్యకళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు, బుల్లితెర నటుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు, రియాజ్‌బాషా, కేతా సుబ్బారావు, అరవ రాయప్ప, పొంగూరు సుబ్బారెడ్డి, దోస్త్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పింఛనర్ల దినోత్సవం


సత్కారం అందుకున్న సీనియర్ పింఛనర్లు

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌లోని పీఎస్ రామానుజాచార్యులు పింఛనర్ల సంక్షేమ సంఘ భవనంలో జాతీయ పింఛనర్ల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పింఛన్ పొందేందుకు ఆద్యుడైన నకరా చిత్రపటానికి నివాళులర్పించారు. ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం 70 ఏళ్లు నిండిన 50 మంది పింఛనర్లను సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, డివిజనల్ సబ్ ట్రెజరీ అధికారి అహ్మద్, ఇందిరా సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ అధినేత డాక్టర్ వివేకానందరెడ్డి, కోవూరు, ఇందుకూరుపేట సబ్ ట్రెజరీ అధికారులు కిరణ్‌కుమార్, రమణరావు, సంఘ కోశాధికారి హజరత్తయ్య, ఖాసిం, వేణు తదితరులు పాల్గొన్నారు.

రెడ్ల ఐక్యవేదిక సమావేశం



నెల్లూరు(బృందావనం): నగరంలోని నిర్మలసౌధలో రెడ్ల ఐక్యవేదిక, నెల్లూరు సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా నిర్మల నరసింహారెడ్డి, రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బీవీ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా గుండాల ప్రతాప్‌రెడ్డి, కోశాధికారిగా హేమంత్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వెందోటి ధనుంజయరెడ్డి, సభ్యులుగా హర్షవర్ధన్‌రెడ్డి, వంటేరు రాజగోపాల్‌రెడ్డిని ఎన్నుకున్నారు. అనంతరం బాల్యంలోనే తండ్రిని కోల్పోయి ఏడో తరగతి చదువుతున్న బుచ్చిరెడ్డిపాళెంకి చెందిన కామిరెడ్డి గ్రీష్మకు రూ.ఐదు వేలను బత్తిన కుమారస్వామిరెడ్డి అందజేశారు. రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి దేవస్థానంలో పూజలు



నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థాన వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామికి విశేష పూజలను దేవస్థాన ప్రధానార్చకుడు చంద్రయ్యస్వామి ఆధ్వర్యంలో జరిపారు. వెయ్యి మందికిపైగా భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. ఉభయకర్తలుగా మోదెం సూర్యప్రకాష్, సుభాషిణి దంపతులు వ్యవహరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ చందోలు సతీష్‌కుమార్, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డైరెక్టర్ కొణిదెల సుధీర్, ధర్మకర్తల మండలి సభ్యులు తాళ్లూరి రవి, రజనికుమార్, రాధిక, శ్రీకాంత్, ప్రశాంతి, ఈఓ దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



నెల్లూరు రూరల్: నారాయణరెడ్డిపేటలోని బాపూజీ వృద్ధాశ్రమంలో అన్నదానాన్ని ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షబ్బీర్ మాట్లాడారు. తమ అసోసియేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎమ్మెస్సెమ్ఈ డైరెక్టర్ కరిముల్లా, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ రఫీ అహ్మద్, నేతలు జమీర్, షానవాజ్, ముజామిల్, రబ్బానీ, హఫీజుల్లా తదితరులు పాల్గొన్నారు.

పదవులపై ఆసక్తి లేదు


మాట్లాడుతున్న నాగబాబు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాజకీయ పదవులపై తనకు ఆసక్తి లేదని జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు పేర్కొన్నారు. పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా సమీక్ష సమావేశంలో భాగంగా నగరంలోని రవీంద్రనాథ్ టాగూర్ ఆడిటోరియంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. తెలంగాణలో తనకు ఉన్న ఓటు హక్కును ఆంధ్రప్రదేశ్‌కు మార్చుకునేందుకు గానూ ఇటీవల అక్కడ జరిగిన ఎన్నికల్లో ఓటు వేయలేదని తెలిపారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు మనుక్రాంత్‌రెడ్డి, అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.